క్లుప్తంగా

నష్టపోయిన రైతులను ఆదుకోండి

సీఎం రంగసామికి వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే అశోక్



తుపాను నష్ట నివేదికను సీఎం రంగసామికి చూపిస్తున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: మిచాంగ్ తుపాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన నియోజకవర్గ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పుదుచ్చేరి సీఎం రంగసామికి వినతిపత్రాన్ని శనివారం అందజేశారు. మిచాంగ్ తుపాను రైతులను కోలుకోలేని దెబ్బతీసిందని సీఎం రంగసామికి ఎమ్మెల్యే అశోక్ వివరించారు. 1996 తుపాను సమయంలో అప్పటి ప్రభుత్వం నియోజకవర్గ పరిధిలో రూ.35 వేలు, రూ.45 వేలు ఆర్థిక సాయంతో నిర్మించిన గృహాలు ప్రస్తుతం శిథిలస్థితికి చేరుకున్నాయన్నారు. వారందరికీ నూతన గృహ నిర్మాణాలకు ఆర్థిక సాయం అందించాలని కోరగా సీఎం రంగసామి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే అశోక్ తెలిపారు.

హరిహర మహాయజ్ఞానికి ఏర్పాట్లు పూర్తి



హరిహర మహాయజ్ఞం ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అశోక్

యానాం: యానాం గౌతమీ గోదావరి తీరంలో పవిత్ర కార్తిక మాసంను పురస్కరించుకుని ఆదివారం నిర్వహించనున్న హరిహర మహాయజ్ఞానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా సుమారు పదెకరాల స్థలంలో ఏర్పాటుచేసిన ప్రధాన వేదిక, అన్నసమారాధన గ్యాలరీల్లో చేసిన ఏర్పాట్లను ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్అశోక్ శనివారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద ఎత్తున భక్తులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. హరిహర మహాయజ్ఞానికి హాజరుకావాలని సీఎం రంగసామికి సైతం ఆహ్వానం పలికామన్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం ఇబ్బందులు లేకుండా బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

లోక్ అదాలత్‌లో 277 కేసుల పరిష్కారం



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జిల్లా రెండో అదనపు న్యాయమూర్తి నరేష్

అమలాపురం టౌన్: స్థానిక కోర్టుల సముదాయంలో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో 277 కేసులు పరిష్కారమయ్యాయి. లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, జిల్లా రెండో అదనపు కోర్టు న్యాయమూర్తి వి.నరేష్ ఆధ్వర్యంలో నేషనల్ లోక్ అదాలత్ జరిగింది. పరిష్కారమైన 277 కేసుల్లో 22 సివిల్ కేసులు, 158 క్రిమినల్ కేసులు, 17 మోటారు యాక్సిడెంట్ కేసులు, 65 ఎక్సైజ్ కేసులు, 13 బీఎస్ఎన్ఎల్ కేసులు, 2 బ్యాంక్ కేసులు ఉన్నాయి. దాదాపు రూ.2.04 కోట్ల విలువైన కేసులు పరిష్కారయ్యాయని కోర్టు కార్యాలయం తెలిపింది. లోక్ అదాలత్‌లో సీనియర్ సివిల్ జడ్జి కె.శైలజ, ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి వి.గౌరీశంకరరావు, జూనియర్ సివిల్ జడ్జి ఎ.హిమబిందుతో పాటు లోక్ అదాలత్ మెంబర్లు, న్యాయవాదులు, పోలీసు అధికారులు, కక్షిదారులు పాల్గొన్నారు.

క్రీడా వస్తువుల పంపిణీ

అమలాపురం రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు ఆడుదాం ఆంధ్ర క్రీడా వస్తువులను ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి శనివారం అందజేశారు. గ్రామ స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో యువతీయువకులు ఉత్సాహంగా పాల్గొన్ని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కుడుపూడి బాబు, దంగేటి రుద్రప్రసాద్, ఎంపీటీసీ దొంగ అంజి, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శులకు క్రీడా వస్తువులను అందిస్తున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి

నీటమునిగిన వరిపొలాల పరిశీలన

క్షేత్రస్థాయిలో నష్టాన్ని అంచనా వేస్తున్న అధికారులు



కిత్తనచెరువులో ముంపు నీటిలో తేలియాడుతున్న వరి పంట

తాళ్లరేవు: మిచాంగ్ తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాల కారణంగా పడిపోయిన, నీట మునిగిన వరిపొలాలను వ్యవసాయ శాఖాధికారి ఎస్.ప్రశాంతి, నాయకులు పరిశీలించారు. మండల పరిధిలోని చొల్లంగి, చొల్లంగిపేట, పటవల తదితర గ్రామాల్లో వరిపొలాలను పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నష్టపోయిన ప్రతీ ఎకరాను గుర్తించి నష్ట పరిహారం వచ్చేలా చేస్తామని హామీ ఇచ్చారు. పలుచోట్ల నీటిలోనే వరి పనలు ఉండడంతో జేసీబీల ద్వారా కాలువలు ఏర్పాటు చేసి నీరు బయటకు పోయే విధంగా చర్యలు చేపట్టామన్నారు. ధాన్యం తేమ శాతం 18 ఉన్నప్పటికీ ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. రంగు మారిన, తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేస్తామని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో చొల్లంగి వ్యవసాయ సహాయకుడు ఎంవీవీ రమణ, నాయకులు స్వర్ణ రాజు, గర్రే లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ముంపులోనే వరి చేలు

అల్లవరం: మిచాంగ్ తుపాను ప్రభావంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీటి మునిగిన వరి పంట ఇంకా ముంపులోనే దర్శనమిస్తుంది. తుపాను వీడి నాలుగు రోజులు కావస్తున్నా నేటికీ వరి పంట మెకాళ్ల లోతు నీటిలో నానుతుంది. డ్రెయిన్లు, కాలువలు ముంపు నీటితో పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలోని అల్లవరం, రెల్లుగడ్డ, దేవగుప్తం, డి.రావులపాలెం, మొగళ్ళమూరు, బెండమూర్లంక తదితర గ్రామాల్లో ముంపు తీవ్రత ఎక్కువగా ఉండడంతో సుమారు 1,700 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శి, వీఆర్ఓ, వ్యవసాయ సహాయకులు సంయుక్తంగా పరిశీలన చేసి నష్టాన్ని అంచనా వేస్తున్నారు. ఐదు రోజుల పాటు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని ఏఓ ఎన్‌వీవీ సత్యనారాయణ తెలిపారు.



చొల్లంగిలో నీట మునిగిన వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ ప్రశాంతి, స్థానిక నాయకులు



డి.రావులపాలెంలో దెబ్బతిన్న వరి పొలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఉప్పలగుప్తంలో...

ఉప్పలగుప్తం మండలంలోని గోపవరం, కూనవరం, విలసవిల్లి, ఉప్పలగుప్తం, సుదాపాలెం, కిత్తనచెరువు గ్రామాల్లో ముంపు తీవ్రత ఎక్కువగా ఉంది. ఈ గ్రామాల్లో ఎక్కువ మేర వరి ముంపులో చిక్కుకుంది. సుమారు 1,650 ఎకరాల్లో వరి ముంపులో ఉందని వ్యవసాయాధికారులు ప్రాథమిక అంచనా వేశారు. ముంపు కారణంగా పాడైన వరి పంట, నారుమళ్లని కాపాడుకోవడానికి ఇంజన్లతో నీటిని బయటకు మళ్లించేందుకు రైతులు శ్రమిస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఐ.పోలవరం: మండలంలో గుత్తినదీవిలో నూతనంగా నిర్మిస్తున్న 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనుల నిమిత్తం ఆదివారం మురమళ్ల, పశువుల్లంక, కమిని, లక్ష్మీదేవిలంక, కొమరగిరి గ్రామాల్లో గృహ, ఆక్వా వినియోగదారులకు విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు ఈఈ మోకా రవికుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

లింగ వివక్షకు వ్యతిరేకంగా అవగాహన సదస్సు



కాట్రేనికోనలో లింగవివక్షకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

కాట్రేనికోన: స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో లింగ వివక్షకు వ్యతిరేకంగా అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమాఖ్య అధ్యక్షురాలు బడుగు రోజా బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించడంతో పాటు లైంగిక వేధింపుల చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం కాట్రేనికోన గేటు సెంటరులో లింగ వివక్షకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేసి ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఏపీఎం ఎ.శ్రీనివాస్, జిల్లా జెండర్ కమిటీ సభ్యులు రోజా, ఎం.లక్ష్మీదుర్గ, అనంత్‌కుమార్, అశ్విని, సీసీ విజయలక్ష్మి, నాగార్జున, సంధ్య పాల్గొన్నారు.

కొట్టుకుపోయిన చెక్క వంతెన



సామంతకుర్రు వద్ద కొట్టుకుపోయిన చెక్క వంతెన

అల్లవరం: అల్లవరం-ఉప్పలగుప్తం మండలాలను కలుపుతూ సామంతకుర్రు వద్ద వాసాలతిప్ప డ్రెయిన్‌పై రైతులు నిర్మించుకున్న చెక్క వంతెన ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. దీంతో సామంతకుర్రు-వాసాలతిప్ప గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. రెండు మండలాలకు చెందిన ఆక్వా రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండే చెక్క వంతెన లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో వంతెన నిర్మించాలని ఏళ్లగా ప్రతిపాదన ఉన్నా అది కార్యాచరణకు నోచుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా వాహనోత్సవం



అంజనేయస్వామి వాహనంపై వేంకటేశ్వరస్వామిని ఊరేగిస్తున్న భక్తులు



విలసవిల్లిలో శివలింగానికి బియ్యంతో చేసిన అలంకరణ



వేంకటేశ్వరస్వామివారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

అమలాపురం రూరల్: మండలంలోని బండారులంక బిళ్లవారి వీధిలో కొలువైయున్న పద్మావతి, అలివేలు మంగ సమేత వేంకటేశ్వరస్వామిని నూతనంగా తయారుచేసిన ఆంజనేయస్వామి వాహనంపై శనివారం పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా గరగ నృత్యాలు, పిల్లల కోలాటంతో వాహనోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్న సంతర్పణ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అంకం హిమభారతి, ఇనుమర్తి సత్యానందకుమార్ స్వామి, చింతపట్ల బాబు, బిళ్ల విశ్వేశ్వరరావు, అంకం నాగ సత్యనారాయణ, అంకం పెద్దిరాజు, నల్ల మధు తదితరులు పాల్గొన్నారు.

విలసవిల్లిలో మహా లింగార్చన

ఉప్పలగుప్తం: కార్తిక మాసం పురస్కరించుకుని విలసవిల్లిలో కొలువైయున్న కోదండ రామాలయంలో పురోహితులు మున్నంగి రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో శనివారం మహా లింగార్చన అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన శివలింగానికి బియ్యంతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వేంకటేశ్వరుని ఆలయానికి పోటెత్తిన భక్తులు

ముమ్మిడివరం: కార్తిక మాసం నాలుగో శనివారం కావడంతో మండలంలో పల్లిపాలెం వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే భక్తులు బారులు తీరి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ జరిగింది. ఆలయ నిర్వాహకులు పెన్మత్స చిట్టిరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

తాళ్లరేవు: మండల పాస్టర్స్ క్రిస్మస్ వేడుకలు శనివారం తాళ్లరేవులో ఘనంగా జరిగాయి. స్థానిక క్రీం కాంపౌండ్ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనారిటీ విభాగం ప్రధాన కార్యదర్శి, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనను పాస్టర్లు ఘనంగా సత్కరించారు. అనంతరం స్టీవెన్‌బాబు వాక్య సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు సాల్మన్ రాజు, బి.జార్జి ముల్లర్, బి.జాన్ విక్టర్, పి.ప్రసాద్, బిషప్ దొమ్మేటి వసంతరావు తదితరులు పాల్గొన్నారు.



పాస్టర్స్ క్రిస్మస్ వేడుకల్లో జెడ్పీటీసీ సభ్యులు శామ్యూల్ సాగర్‌ను సత్కరిస్తున్న పాస్టర్లు

బాధితులకు సాయం అందజేత



బాధితునికి నిత్యావసరాలు అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ

తాళ్లరేవు: అనారోగ్యానికి గురై ఆర్థిక ఇబ్బందులు పడుతున్న రెండు కుటుంబాలకు ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరకులు శనివారం అందజేశారు. ఐ.పోలవరం మండలం పితానివారిపాలేనికి చెందిన యనమదల సత్యనారాయణ అనారోగ్యం కారణంగా కాలు పోగొట్టుకోగా అతడి కుటుంబానికి రూ.6 వేల నగదు, కిరాణా సరకులు అందజేశారు. అలాగే మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయ సమీపాన నివసించే మామిడిశెట్టి సింహాద్రి బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతూ కాళ్లు, చేతులు పని చేయకపోవడంతో ఆ కుటుంబానికి రూ.6 వేల నగదు, నిత్యావసర సరకులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సభ్యుడు మట్టపర్తి శివకుమార్, కొప్పిశెట్టి గణేష్, మాజీ ఎంపీటీసీ కడలి ఉమామహేశ్వరరావు, మర్లపాలెం సర్పంచ్ విత్తనాల బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

కళాఉత్సవ్‌లో దుర్గేష్‌కు ప్రథమ బహుమతి

యానాం: నవంబర్ 18 నుంచి 22 వరకూ కర్ణాటకలోని హసన్‌లో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయలో జరిగిన ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో యానాం నవోదయ 9వ తరగతి విద్యార్థి దుర్గేష్ ప్రథమ బహుమతి సాధించినట్లు శనివారం ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో ఏటికొప్పాక లక్క బొమ్మలు, 2డీ 3డీ పెయింటింగ్స్‌ను ప్రదర్శించారు. మాస్టర్ దుర్గేష్ ప్రదర్శించిన పెన్సిల్ స్కెచ్‌కు ప్రథమ బహుమతి వచ్చిందన్నారు. హైదరాబాద్ రీజియన్ నుంచి 8 నవోదయ విద్యాలయాలు పాల్గొనగా యానాం నుంచి ఒకటి ఎంపిక కావడం విశేషమన్నారు. చదువుతో పాటు లలిత కళల్లో ప్రావీణ్యం సంపాదించాలనే నూతన విద్యావిధానం-2019 ప్రకారం ఆర్ట్ ఇన్ ఎడ్యుకేషన్ గురించి విద్యార్థులకు నేర్పుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన దుర్గేష్‌కు మెమొంటో, సర్టిఫికెట్‌ను అందజేసి అభినందించారు.



కళాఉత్సవ్‌లో ప్రథమ బహుమతి అందుకుంటున్న దుర్గేష్

ముంపు బాధితులకు ఆహార పొట్లాల పంపిణీ



ముంపు బాధితులకు పంపిణీ చేసేందుకు ఆహార పొట్లాలు సిద్ధం చేసిన నాయకులు

అమలాపురం టౌన్: పట్టణంలోని 27వ వార్డు పరిధిలోని కార్మిక నగర్‌లో ముంపు బాధితులకు ఆ వార్డు కౌన్సిలర్ బండారు గోవింద్, వార్డు సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు ఆహార పొట్లాలను శనివారం పంపిణీ చేశారు. ఇంకా ముంపు నీటిలోనే నానుతున్న ఇళ్ల వద్దకు కౌన్సిలర్, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు ముంపులోనే నడిచి వెళ్లి మరీ ఆహార పొట్లాలను అందజేశారు. కష్టకాలంలో ఆదుకుంటున్నారంటూ బాధితులు సంతోషం వ్యక్తం చేశారు.

ఇంటింటా ఆరోగ్య సర్వే

కాట్రేనికోన: మండలంలోని రామస్వామి తోట, చెంచుల గరువు, వేట్లపాలెం, గచ్చకాయలపోర తదితర గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లో జ్వరాలు, ఇతర ఆరోగ్య సమస్యలపై కాట్రేనికోన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం ఇంటింటా ఆరోగ్య సర్వే చేపట్టారు. ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రోగులకు మందులు ఉచితంగా అందచేశారు. ఆరోగ్య సర్వేలో ఏఎన్ఎం శ్రీలక్ష్మి, ఆరోగ్య కార్యకర్త, ఆశ తదితరులు పాల్గొన్నారు.



కాట్రేనికోన చెంచుల గరువులో ఆరోగ్య సర్వే చేస్తున్న సిబ్బంది

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు ఆమోదం

యానాం: పుదుచ్చేరివ్యాప్తంగా నాలుగు రీజియన్లలో 4.07లక్షల స్మార్ట్ విద్యుత్ మీటర్ల ఏర్పాటుకు సంబంధించిన ఫైలుకు ఎల్జీ తమిళిసై సౌందరాజన్ శనివారం ఆమోదం తెలిపారు. 2022-23 బడ్జెట్‌లో సీఎం రంగసామి బడ్జెట్‌లో ప్రతిపాదించిన విధంగా ప్రీపెయిడ్ ఎలక్ట్రిసిటీ మీటర్లు ఏర్పాటుచేస్తామని తద్వారా విద్యుత్ వాడకం లెక్కలు, కలెక్షన్‌లలో కచ్చితత్వం ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డ్రాఫ్ట్ రిపోర్టులో రూ.251.10 కోట్లు ఖర్చు అవుతున్నట్లు పేర్కొన్నారు. దాంట్లో కేంద్రం 15శాతం సబ్సిడీ ఇవ్వగా, అదనంగా 7.5 శాతం ప్రాజెక్టు పూర్తయ్యేలోగా ఇవ్వనుంది. ఇప్పటికే కేంద్రంతో ప్రభుత్వం ఎంఒయూ కుదుర్చుకుంది. ఒక్కో మీటర్ ఏర్పాటుకు ప్రతినెలా రూ.80 చొప్పున 90 నెలల పాటు తీసుకుంటారు.

ఉత్సాహంగా కార్తిక వనసమారాధన

- కార్తిక దామోదరునికి పూజలు
- అలరించిన చిన్నారుల ఆటల పోటీలు

తాళ్లరేవు: పవిత్ర కార్తిక మాసం సందర్భంగా జార్జిపేట గోపాల్ గార్డెన్స్‌లో కార్తిక వనసమారాధన కార్యక్రమం శనివారం ఉత్సాహంగా జరిగింది. శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మహిళలు ఉసిరిచెట్టు వద్ద కార్తిక దామోదరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చిన్నారులు లెమన్ అండ్ స్పూన్, గన్ని బ్యాగ్స్ రేస్, రన్నింగ్ ఆటలాడగా మహిళలు మ్యూజికల్ చైర్స్ తదితర ఆటలు ఆడి అలరించారు. ఈ సందర్భంగా మహాత్మా జ్యోతీరావు పూలే, దొమ్మేటి వెంకటరెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, శెట్టిబలిజ నాయకులు పితాని బాలకృష్ణ, గుత్తుల సాయి తదితరులు హాజరై ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. యువకులంతా సంఘటితంగా సమాజ హితం కోరే పనులు చేయాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో టీకుమూడి లక్ష్మణరావు, రాయుడు గోవిందు, పెంకే ఏడుకొండలు, గుత్తుల సూర్యనారాయణ, రెడ్డి సతీష్, పిల్లి సత్తిబాబు తదితరులు హాజరయ్యారు.

శెట్టిబలిజలు ఐక్యతను చాటాలి: రాజ్యసభ సభ్యుడు సుభాష్‌చంద్రబోస్

అమలాపురం రూరల్: పట్టణ శివారు కొంకాపల్లి సత్తెమ్మ తల్లి గుడి ప్రాంగణంలో ఆదివారం నిర్వహించనున్నజిల్లా శెట్టిబలిజ కార్తిక వన సమారాధనను విజయవంతం చేసి ఐక్యతను చాటాలని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాస్ చంద్రబోస్ పిలుపునిచ్చారు. సత్తెమ్మ తల్లి గుడి ప్రాంగణంలో శనివారం ఏర్పాటు చేసిన వన సమారాధన సన్నాహక సమావేశానికి సుభాష్ చంద్రబోస్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వన సమారాధనకు విశాఖపట్నం, విజయవాడ, కాకినాడ, రాజమహేంద్రవరం ప్రాంతాలతో పాటు తెలంగాణ నుంచి శెట్టిబలిజ సంఘాల ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. ఎవరికీ ఇబ్బంది కలగకుండా వేడుకలను ప్రశాంత వాతావరణంలో వనసమారాధన ఆత్మీయంగా జరుపుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్తిక వన సమారాధన ఆహ్వాన కమిటీ చైర్మన్, శెట్టిబలిజ యూత్ ఫోర్స్ అధ్యక్షుడు వాసంశెట్టి సుభాష్, తెలంగాణ రాష్ట్ర శెట్టిబలిజ నాయకుడు గుత్తుల మీరా కుమార్, జిల్లా శెట్టిబలిజ సంఘాల పెద్దలు వాసంశెట్టి సత్యం, పితాని బాలకృష్ణ, వాసంశెట్టి చినబాబు, రాయుడు సత్యరుషి పాల్గొన్నారు.



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు సుభాష్‌చంద్రబోస్ తదితరులు

ఆత్మీయంగా కాపుల కార్తిక వన సమారాధన

అమలాపురం టౌన్: తెలగా అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో స్థానిక మెట్ల సత్యనారాయణరావు కాపు కల్యాణ మండపంలో కాపుల కార్తిక వన సమారాధన కార్యక్రమం శనివారం ఆత్మీయ వాతావరణంలో జరిగింది. కోనసీమవ్యాప్తంగా కాపు సంఘాల నేతలు, ఆ సామాజిక వర్గీయులు ఈ వన సమారాధనలో పాల్గొని సహపంక్తి భోజనాలు చేసి తమ సంఘటితాన్ని చాటారు. తొలుత కాపు నాయకుడు మెట్ల రమణబాబు సామాజిక వర్గీయుల సమక్షంలో ఉసిరి చెట్టుకు కార్తిక పూజలు చేశారు. కోనసీమ కాపు సంఘాల నేతలు బోనం కనకయ్య, నల్లా విష్ణుమూర్తి, చిక్కాల గణేష్, కల్వకొలను తాతాజీ, వంటెద్దు వెంకన్నాయుడు, అల్లాడ స్వామినాయుడు, కల్వకొలను బాబి, నల్లా శ్రీధర్, మోకా వెంకట సుబ్బారావు , నల్లా పవన్, సూదా గణపతి, గంధం పల్లంరాజు తదితరులు ప్రసంగించారు. అనంతరం అందరూ సహపంక్తి భోజనాలు చేసి ఆత్మీయంగా పలకరించుకున్నారు.

నేడు విశ్వ బ్రాహ్మణుల కార్తిక వన సమారాధన

అమలాపురం టౌన్: స్థానిక వాసర్ల గార్డెన్‌లో విశ్వబ్రాహ్మణ, స్వర్ణకార సంఘం కార్తిక వన సమారాధన ఆదివారం నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భరణికాన బాబు, ఓడూరి ఫణీంద్రకుమార్ తెలిపారు. కార్తిక వన సమారాధన కారణంగా పట్టణంలోని విశ్వ బ్రాహ్మణ, స్వర్ణకారుల దుకాణాలకు ఆదివారం సెలవు ప్రకటించామన్నారు. వృత్తిదారులు, సంఘీయులు కుటుంబ సమేతంగా హాజరు కావాలని కోరారు.



జార్జిపేటలో తులసి చెట్టు వద్ద పూజలు చేస్తున్న శెట్టిబలిజ సంఘ ప్రతినిధులు



చిన్నారులకు గన్నీ బ్యాగ్ రన్నింగ్ పోటీలను నిర్వహిస్తున్న నాయకులు



కార్తిక వన సమారాధనలో పాల్గొన్న కాపు సామాజిక వర్గీయులు

నాఫెడ్ కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట: ప్రభుత్వం ఏర్పాటు చేసిన నాఫెడ్ కొబ్బరి కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. అంబాజీపేట మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న నాఫెడ్ కొనుగోలు కేంద్రాన్ని శనివారం బోస్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కొబ్బరి రైతులకు ఇబ్బందులు లేకుండా కొబ్బరిని కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేసిన వారం రోజుల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పి.కె.రావు, సొసైటీ అధ్యక్షుడు వాసంశెట్టి రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబులు ఆయన వెంట ఉన్నారు.